సాక్షి
జగిత్యాల
గురువారం । 11 । జనవరి । 2024



గోదావరిలో భక్తుల రద్దీ

ధర్మపురి: షష్టిమాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి గోదావరిలో స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మలకు మొక్కులు చెల్లించారు.



మోడల్ స్కూల్ పిలుస్తోంది

ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉమ్మడి జిల్లాలోని మోడల్ స్కూళ్లు ఆహ్వానం పలుకుతున్నాయి.

- 8లో

గరిష్టం/కనిష్టం
28.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. సాయంత్రం, రాత్రి సమయంలో చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలకు పదోన్నతి



పదోన్నతి పత్రాలు అందిస్తున్న కలెక్టర్

జగిత్యాల: జిల్లాలోని 28 మినీ అంగన్‌వాడీ టీచర్లకు జీవో నంబరు 37 ప్రకారం పదోన్నతి కల్పించారు. ఈ మేరకు కలెక్టర్ యాస్మిన్ బాషా బుధవారం వారికి పదోన్నతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పదోన్నతులతోపాటు, బాధ్యతలూ పెరిగాయని, మహిళలు, పిల్లలు పోషణ, అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, ధర్మపురి సీడీపీవో వాణిశ్రీ, సూపర్‌వైజర్లు లత, నీలిమ, శైలజ పాల్గొన్నారు.

గృహలక్ష్మి బిల్లుల కోసం ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసనలో లబ్ధిదారులు

జగిత్యాలటౌన్: గృహలక్ష్మి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. వీరికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ప్రొసీడింగ్స్‌ను కలెక్టర్‌కు చూపించేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బల్దియా ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాలో చాలామందికి గృహలక్ష్మి మంజూరు చేస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చిందని, దీంతో తాము నిర్మాణాలు ప్రారంభించామని, వాటికి బిల్లులు మంజూరు చేయాలని కోరారు. గతంలో గ్రౌండింగ్ చేసిన దళితబంధు యూనిట్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ దివాకరను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు కూసరి అనిల్, సమ్మిల్ల శ్రీనివాస్, బాలె శంకర్, తోట మల్లికార్జున్, ఒద్ది రాంమోహన్‌రావు గుర్రం రాము పాల్గొన్నారు.

చిన్న వయస్సులోనే సీఏ ఉత్తీర్ణత



రణధీర్

జగిత్యాల: అతి చిన్న వయసు (21 ఏళ్ల)లోనే సీఏలో ఉత్తీర్ణత సాధించాడు సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన బొక్కల రణధీర్. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉన్న ఆయన పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో.. ఇంటర్ హైదరాబాద్‌లోని సీఎంఎస్ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాడు. గ్రామానికి చెందిన బొక్కల రమేశ్, సునీత దంపతుల కుమారుడు రణధీర్ ఎంఈసీలో 968 మార్కులతో ఉత్తీర్ణుడై.. అదే సంవత్సరం సీపీటీ పరీక్ష పాసై 2020లో సీఏ ఇంటర్ పూర్తిస్థాయి ఆర్టికల్‌షిప్ పూర్తి చేశాడు. 2023లో నిర్వహించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో ఒకే ప్రయత్నంలో అర్హత సాధించాడు. గ్రామీణ ప్రాంతం నుంచి అతిచిన్న వయస్సులోనే సీఏ పూర్తిచేసిన ఘనత సాధించాడు. ఈ సందర్భంగా బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. బహుళజాతీయ కంపెనీల్లో ఉద్యోగం చేయడమే తన కర్తవ్యమన్నాడు రణధీర్.

నేడు వ్యవసాయ కళాశాల బంద్



వ్యవసాయ కళాశాల ఎదుట విద్యార్థులు

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వంద ఎకరాల భూమిని రాష్ట్ర హైకోర్టు నూతన భవనాలకు కేటాయించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు పొలాస వ్యవసాయ విద్యార్థులు ప్రకటించారు. ఈ సందర్భంగా పొలాస వ్యవసాయ కళాశాలలో గురువారం నుంచి జరిగే ఆందోళనలపై వ్యవసాయ విద్యార్థులు సమావేశమై కార్యాచరణ ప్రకటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 55ను ఉపసంహరించేంత వరకు విద్యార్థులందరం ఆందోళనకు దిగుతున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో గురువారం నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే కళాశాల బంద్‌కు పిలుపునిచ్చినట్లు వివరించారు.

నిబంధనలు బేఖాతర్

- నాలుగేళ్ల క్రితం కోరుట్ల పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లో ఓ బట్టల షాపులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.7కోట్ల నష్టం వాటిల్లింది. చుట్టుపక్కల షాపులు, ఇళ్లకు మంటలు అంటుకుని ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో ఫైర్ నిబంధనలు పాటించుకుండానే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగిందని ఫైర్ అధికారులు హడావుడి చేశారు. ఆ తరువాత మళ్లీ అదేచోట ఫైర్ నిబంధనలపై ఎలాంటి పట్టింపు లేకుండా నిర్మాణం చేపట్టారు. మున్సిపల్, ఫైర్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్నారు. ఇదేమిటంటే..రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయ్..అని మిన్నకుండిపోతున్నారు.

- మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని కాలవ్వగడ్డ వద్ద జనావాసాల మధ్య ఓ సామిల్ మంటల్లో దగ్ధమైంది. సుమారు రూ.కోటిన్నర నష్టం వాటిల్లింది. అయితే చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించే ప్రమాదం ఉండడంతో ఆ ప్రాంతంలోని జనం తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అదృష్టవశాత్తు మంటలు సకాలంలో తగ్గడం కలిసొచ్చింది. ఇక్కడా ఫైర్‌సేఫ్టీ నిబంధనల అమలు శూన్యం.

- ఫైర్ నిబంధనలు హుళక్కి
- అడ్డగోలుగా ప్రైవేటు ఆసుపత్రులు, కాంప్లెక్సుల నిర్మాణం
- ప్రమాదం జరిగినపుడే నిబంధనల హడావుడి
- అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు..



కోరుట్లలో మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైన సామిల్

కోరుట్ల: కోరుట్ల వంటి పట్టణాల్లో తరచూ భారీ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా ఫైర్ సేఫ్టీ నిబంధనలపై ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఐదారు అంతస్తుల భవనాల్లో ఫైర్ నిబంధనలు పాటిస్తున్న దాఖలాలు లేవు. కోరుట్ల బస్టాండ్ సమీపంలో రెండు భవంతులు, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఓ ఆసుపత్రి భవనం, ఓ వ్యాపార సముదాయం, ఓ అపార్ట్‌మెంట్, మూడు ఆసుపత్రి భవనాలు, జాతీయ రహదారి వెంట ఉన్న దేశాయినగర్‌లో రెండు వ్యాపార సముదాయాలు, పూల్‌వాగు దాటిన తరువాత నిర్మాణంలో ఉన్న రెండు అపార్ట్‌మెంట్‌లు, టీచర్స్‌క్లబ్ రోడ్‌లో ఓ ఆసుపత్రి భవనం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక చోట్ల ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు.

నిబంధనల అమలుపై నిర్లిప్తత..

- ఫైర్ నిబంధనల ప్రకారం ఆసుపత్రులు, ఇతర వ్యాపార సముదాయాలు మంటలు ఆర్పడానికి అవసరమైన పూర్తి సన్నద్ధతను కలిగిఉండాలి.
- మొదటగా షాపింగ్ కాంప్లెక్సులు, ఆసుపత్రుల నిర్వాహకులు తమ భవనాల చుట్టూ ఫైర్ ఇంజిన్ తిరిగేలా రోడ్డు వెసులుబాటు కలిగి ఉండాలి.
- 15 మీటర్ల ఎత్తు దాటిన ఆసుపత్రులు, కాంప్లెక్సులు భవంతుల నిర్మాణ సమయంలోనే పైఅంతస్తులో(టెర్రస్) వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి వాటి నుంచి ప్రతి ఫ్లోర్‌కు పైప్‌లు (ఆటోమేటిక్ స్ప్రింక్లర్లు) అమర్చి మంటలు చెలరేగిన సమయంలో వాటిని ఓపెన్ చేసి ఆ నీటితోనే మంటలు ఆర్పే ఫైర్‌సేఫ్టీ టెక్నాలజీని కలిగిఉండాలి.
- అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉండే పరిశ్రమలు, ఇతర వ్యాపార సముదాయాలు జనావాసాల మధ్య ఏర్పాటు చేయకూడదు. పట్టణ శివారుల్లోనే వాటిని ఏర్పాటు చేయడానికి అనుమతించాల్సి ఉంటుంది.
- మంటలు ఆర్పే అగ్నిమాపక యంత్రాలు ప్రతి అంతస్తులోనూ తప్పకుండా ఉంచాలి. అంతే కాకుండా వాటి వినియోగంపై వ్యాపార లేదా ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బందికి అవగాహన ఉండాలి.

రాజకీయ ఒత్తిళ్లు..?

ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలు విషయంలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించే యత్నాలు చేస్తున్నప్పటికీ స్థానిక రాజకీయ నాయకులు ఒత్తిళ్లు తేవడంతో నిర్లిప్తంగా ఉంటున్నట్లు సమాచారం. కోరుట్ల పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయించడంపై ఆసక్తి చూపని నేతలు.. ఫైర్‌సేఫ్టీ నిబంధనల విషయంలో అధికారులపై ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఫైర్‌సేఫ్టీ నిబంధనల అమలుపై నిర్లక్ష్యం చూపితే ఒక్కోసారి ఆస్తి నష్టమే కాకుండా ప్రాణనష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. అధికారయంత్రాంగం ఫైర్‌సేఫ్టీ నిబంధనల విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల అమలుపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది.

- భవంతుల ప్రతి అంతస్తులో అగ్ని ప్రమాదం జరిగడానికి ఆస్కారం ఉన్నట్లు పొగను గుర్తించే ఆటోమేటిక్ స్మోక్ అలారం పరికరాలు ఏర్పాటు చేయాలి.
- భవంతుల నిర్మాణ సమయంలో ఇలాంటి నిబంధనలు అమలు చేస్తున్నారా..? లేదా అనే విషయంలో నిర్మాణ అనుమతులకు ముందుగానే మున్సిపల్ అధికారులు ఫైర్ అధికారుల నుంచి ఎన్‌వోసీ ఉందా లేదా చూసుకోవాలి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

ఫైర్‌సేఫ్టీ నిబంధనల అమలు విషయంలో కచ్చితంగా చర్యలు తీసుకుంటున్నాం. మా దృష్టికి వచ్చిన ప్రతి అంశాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాత ఎన్‌వోసీ ఇస్తున్నాం. రాజకీయ ఒత్తిళ్లను పట్టించుకోకుండా నిబంధనలు అమలు చేస్తున్నాం. ఫైర్ సేఫ్టీ నిబంధనల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే మా దృష్టికి తీసుకురావాలి.

– మల్లికార్జున్, ఫైర్‌సేఫ్టీ అధికారి, మెట్‌పల్లి

జగిత్యాలకు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కేంద్రం ఇవ్వండి

- కేంద్రమంత్రికి ఎంపీ అర్వింద్ లేఖ



కోరుట్ల: జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి శయశంకర్‌కు బుధవారం లేఖ రాశారు. జగిత్యాల జిల్లా పరిసర ప్రాంతాల్లో జనాభా అధికంగా ఉందని, వీరిలో చాలామంది గల్ఫ్, విదేశాలకు వెళ్తారని, సమీపంలో పాస్‌పోర్ట్ కార్యాలయం లేకపోవడంతో కరీంనగర్ లేదా నిజామాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జగిత్యాలలో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటు చేస్తే బాగుంటుందని వివరించారు.

ప్రీస్కూల్ పిల్లల హాజరుశాతం పెంచాలి



మాట్లాడుతున్న ఆడెపు భాస్కర్

జగిత్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల హాజరుశాతం పెంచాలని, పోషకాహారం సక్రమంగా అందించాలని జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో బుధవారం సమావేశమయ్యారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని, కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్య సక్రమంగా అందించాలని, పిల్లలు, తల్లులకు పోషకాహారం అందించాలని సూచించారు. ప్రతినెలా పిల్లల పెరుగుదలపై పర్యవేక్షించాలని, పోషణలోపంతో ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. సీడీపీవో వీరలక్ష్మి, సూపర్‌వైజర్లు జానకీ, స్వరూపరాణి, భాగ్యలక్ష్మి, లావణ్య, రాధ, మధు, శ్రీధర్ పాల్గొన్నారు.

జగిత్యాల బల్దియా చైర్మన్ ఎన్నికయ్యేనా..?

- ఏడాదిగా ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలు
- ఎన్నిక నిర్వహించాలంటూ సీడీఎంకు లేఖ



జగిత్యాల మున్సిపాలిటీ

జగిత్యాల: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలను బీఆర్‌ఎస్ పార్టీ గత ఎన్నికల్లో గెలుచుకున్న విషయం తెల్సిందే. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బల్దియాలో అవిశ్వాస తీర్మానాలు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే కోరుట్ల, మెట్‌పల్లిల్లో అవిశ్వాసానికి పావులు కదుపుతున్నాయి. జగిత్యాలలోనూ అదే పార్టీ నుంచి బోగ శ్రావణి చైర్‌పర్సన్‌గా ఎన్నిక కాగా.. పార్టీలో కౌన్సిలర్లు, శ్రావణి మధ్య వివాదాలు చోటుచేసుకుని 2023 జనవరి 25న ఆమె తన పదవికి రాజీనామా చేశారు. వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అప్పటినుంచి ఆయనే కొనసాగుతున్నారు. అయితే రిజర్వేషన్ ప్రకారం జగిత్యాల మున్సిపల్ బీసీ మహిళ. ఆ స్థానంలో అగ్రకులానికి చెందిన శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించడంతో అతడిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లోనే చైర్మన్ ఎన్నిక పెట్టాలని ఎలక్షన్ కమిషన్ మున్సిపల్ కమిషనర్‌కు లేఖ పంపినా.. శ్రావణి కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీగా ఉందని తిరిగి లేఖ పంపించారు. ఇన్‌చార్జి పాలన ఉండడంతో జగిత్యాలలో అవిశ్వాస తీర్మానానికి తావు లేకుండా పోయింది. అయితే ఇటీవల మున్సిపల్ కమిషనర్ సీడీఎంఏతోపాటు, ప్రిన్సిపల్ సెక్రటరీకి కౌన్సిలర్ స్థానంతోపాటు చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించాలంటూ లేఖ పంపించారు. అప్పటికే ప్రభుత్వం మారడంతో అక్కడినుంచి వచ్చే సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో బుధవారం ప్రస్తుత ఇన్‌చార్జి శ్రీనివాస్ బల్దియా చైర్మన్‌కు ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

ఏడాది గడువు

చైర్మన్ పదవికి ఇంకా ఏడాది మాత్రమే గడువు ఉంది. శ్రావణి రాజీనామా చేసే సమయానికి రెండేళ్ల సమయం ఉండగా.. చైర్మన్ పదవి కోసం చాలామంది ప్రయత్నాలు చేశారు. వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్ గెలిచినప్పటికీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చైర్మన్ ఎన్నిక కోసం ఎవరూ పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదు. తాజాగా శ్రీనివాస్ కలెక్టర్‌కు లేఖ ఇవ్వడంతో కొందరు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అత్యధిక కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ వారే..

2020 జనవరి 22న జరిగిన బల్దియా ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధికంగా 30 సీట్లు గెలుపొందింది. కాంగ్రెస్ ఏడు సీట్లతో సరిపెట్టుకుంది. స్వతంత్రులు ఆరుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, ఏఐఎఫ్‌బీ నుంచి ఒకరు, ఏఐఎంఐఎం నుంచి ఒకరు చొప్పున గెలుపొందారు. ఒక్కరిద్దరు మినహా స్వతంత్రులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇప్పటికీ బీఆర్‌ఎస్‌కు చెందిన వారే అత్యధికంగా కౌన్సిలర్లు ఉండటంతో అవిశ్వాసానికి ఇక్కడ ఆస్కారం లేకుండాపోయింది.

చైర్మన్ ఎన్నికకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఇన్‌చార్జి చైర్మన్ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

జగిత్యాల మున్సిపల్ చైర్మన్‌కు ఎన్నిక నిర్వహించాలని ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. చైర్మన్ పదవికి శ్రావణి రాజీనామా చేయగా.. వైస్ చైర్మన్‌గా ఉన్న తనకు అప్పటి కలెక్టర్ ఇన్‌చార్జి ఇచ్చారని, ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం చైర్మన్ ఎన్నికతోపాటు తనను వైస్ చైర్మన్‌గా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్యాల ఎంపీపీపై అవిశ్వాసంలో ట్విస్ట్



సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు

- హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తీసుకువచ్చిన ఎంపీపీ
- ఉత్తర్వుల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో ప్రకటన
- చివరివరకూ కోర్టు ఉత్తర్వులు గోప్యం

మల్యాల: మల్యాల ఎంపీపీపై సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానం చివరి నిమిషంలో మలుపు తిరిగింది. కొద్దిసేపట్లో ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గుతుందని నేరుగా సమావేశానికి వచ్చిన ఎంపీటీసీలు ఎంపీపీ హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకోవడంతో అవాక్కయ్యారు. స్టే విషయాన్ని ఎంపీపీ చివరి నిమిషం వరకూ గోప్యంగా ఉంచడం గమనార్హం. మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు పది బీఆర్‌ఎస్, మూడు బీజేపీ, ఒకటి కాంగ్రెస్ గెలచుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు ఏడుగురు కాంగ్రెస్‌లో చేరారు. డిసెంబర్ 23న బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీ మిట్టపల్లి విమలపై బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించారు. దీంతో బుధవారం ఉదయం 11.30 గంటలకు జగిత్యాల ఆర్డీవో నర్సింహామూర్తి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. క్యాంపులో ఉన్న ఎంపీటీసీలు నేరుగా కార్యాలయానికి చేరారు. ఎంపీపీ హైకోర్టు నుంచి తెచ్చుకున్న మధ్యంతర ఉత్తర్వులను అధికారులకు అందించారు. వాటిని పరిశీలించిన అధికారులు అవిశ్వాసం ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఏ అంశం ఆధారంగా మధ్యంతర ఉత్తర్వులు తీసుకువచ్చారో చెప్పాలని ఎంపీటీసీలు ఆర్డీవోను కోరగా.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం వాయిదా వేస్తున్నామన్నా. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన సీఐ బిల్లా కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు కార్యాలయం వైపు రాకుండా అంబేడ్కర్ విగ్రహం వద్దనే నిలిపివేశారు. ఎంపీటీసీలు ఆగంతపు రవళి, కొల్లూరి గంగాధర్, పోతాని రవి, సఫియాబేగం వలి, మరాటి సంజన, సంగని రవి, క్యాతం పద్మ, మారంపల్లి నర్సవ్వ, అనిత, వనిత పాల్గొన్నారు.

ఖాదీ కాంప్లెక్స్‌పై చర్యలకు ఒత్తిడి..?

- అనుమతి లేకుండా గదుల నిర్మాణం
- బల్దియా ఆదాయానికి భారీగా గండి
- యాజమాన్యం తీరుపై విమర్శలు



ఖాదీ కాంప్లెక్స్

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్‌లోగల మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అయితే దీనికి మున్సిపల్ నుంచి అనుమతులు తీసుకోకపోవడం ప్రస్తుతం వివాదానికి దారి తీసింది. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన కాంప్లెక్స్ విషయంలో చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష కౌన్సిలర్లు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు ఎలా వ్యవహరిస్తారనేది చర్చనీయాంశమైంది.

వందకు పైగానే గదుల నిర్మాణం

ఖాదీకి చెందిన స్థలంలో నాలుగేళ్ల క్రితం వందకుపైగా గదులను నిర్మించారు. వీటిని అద్దెకు తీసుకోవడానికి ఆసక్తి ఉన్న వారినుంచి ముందుగానే డిపాజిట్ల రూపంలో సొమ్ము సేకరించారు. వాటితో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం వీటిలో వివిధ రకాల వ్యాపారాలు సాగుతున్నాయి. అయితే ఖాదీ యాజమాన్యం మున్సిపల్ అనుమతి తీసుకోకపోవడంతో మొదటి నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇబ్బంది పడుతున్న వ్యాపారులు

మున్సిపల్ నుంచి అనుమతి తీసుకోకపోవడంతో కాంప్లెక్స్‌లో అద్దెకు ఉంటున్న వ్యాపారులు రుణాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రేడ్ లైసెన్స్ ఉంటేనే వ్యాపారులు రుణాలు పొందే అవకాశముంటుంది. అనుమతులు లేకపోవడంతో వ్యాపారులు దరఖాస్తు చేసుకుంటున్నా అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేయడం లేదు.

ఆస్తి పన్ను బకాయిల చెల్లింపుపై నిర్లక్ష్యం

ఆస్తి పన్ను కింద ఖాదీ ప్రతిష్టాన్ రూ.50లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. సామాన్యులు ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకోకపోయినా.. ఒక్క ఏడాది ఆస్తి పన్ను చెల్లించకపోయినా కఠినంగా వ్యవహరించే అధికారులు ఖాదీ విషయంలో రాజకీయ కారణాలతో మెతక వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ప్రతిపక్ష కౌన్సిలర్లు, నాయకులు ఖాదీ ప్రతిష్టాన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీస్తుండడం అధికారులకు ఇబ్బందిగా మారింది.

నోటీసులు ఇచ్చాం

ఖాదీ ప్రతిష్టాన్ షాపింగ్ కాంప్లెక్స్ విషయంలో నోటీసులు జారీ చేశాం. దుకాణ సముదాయాలకు నెంబర్లు తీసుకోవాలని సూచించాం. అలాగే ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలని కూడా చెప్పాం. తొందరలోనే వసూలు చేస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్

ప్రభుత్వ స్కూళ్లకు రక్షణ కరువు

- జిల్లాలో ప్రహరీలు లేని పాఠశాలలు 200కుపైగానే..
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కొన్ని విద్యాలయాలు
- ఆవరణల్లో మూగజీవాలు, విష కీటకాల సంచారం
- భయాందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రహరీ లేని లక్ష్మీపూర్ ఎస్సీకాలనీ పాఠశాల

గొల్లపల్లి: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 511 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 187 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మన ఊరు – మనబడి కింద 258 పాఠశాలలకు ప్రహరీగోడలు మంజూరయ్యాయి. వీటిలో కొన్ని ప్రగతి దశలో ఉన్నాయి. 223 పీఎస్, యూపీఎస్, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు పూర్తి స్థాయిలో ప్రహరీలు లేవు. మిగిలిన పాఠశాలల్లో పాతగోడలు, మరి కొన్నిచోట్ల ఒకవైపు కొంతమేర నిర్మాణాలు చేపట్టి మిగితా వైపు అసంపూర్తిగా వదిలేశారు. ప్రహరీలు లేకపోవడంతో ఆవరణలోకే ఆవులు, గేదెలు, పందులు వస్తున్నాయి. ఇతర మూగ జీవాలు పాఠశాలల్లోకి ప్రవేశించి పిల్లల చదువులకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఉదయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వచ్చి చూస్తే పేడకుప్పలు, చెత్తాచెదారం కనిపిస్తోంది. ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా మారుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులే తొలగించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్కూళ్ల ఆవరణలో హరితహారం కింద నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. మరికొన్ని పాఠశాలలు రాత్రివేళ మందుబాబులకు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఉపాధ్యాయులు, ప్రజలు అంటున్నారు.

విషకీటకాలతో భయాందోళన

జిల్లాలోని చాలా పాఠశాలలు ఊరికి చివరన గుట్టలు, అటవీప్రాంతాలను ఆనుకొని ఉండటం.. ప్రహరీలు లేకపోవడంతో విషపురుగులు, కీటకాలు వస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మన ఊరు – మనబడి కింద పాఠశాలలకు రూ.లక్షలాది నిధులు విడుదలవుతున్నాయి. అయినా ప్రహరీలు ఎందుకు నిర్మించడం లేదని అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు విడుదల చేసిన (సీడీపీ) నిధులతో ప్రహరీలు లేని పాఠశాలలకు ప్రహరీలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, వాటికి కావాల్సిన వసతులు వివరాలను ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం ఇటీవల సీడీపీ నుంచి 40 శాతం నిధులు, ప్రభుత్వ పాఠశాలలకు ఖర్చు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిధులతో త్వరలోనే పాఠశాలల్లో వసతులు కల్పించి ఇతర సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం. మన ఊరు – మన బడి కింద మండలంలో 17 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం జరుగుతోంది. 15 పాఠశాలలకు ప్రహరీలు లేవు.

– జమునాదేవి, ఎంఈఓ, గొల్లపల్లి

క్లుప్తంగా

కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ.71లక్షలు


డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయ హుండీల ఆదాయాన్ని బుధవారం ఆలయ ఈవో వెంకటేశ్ సమక్షంలో లెక్కించారు. 35రోజులకు రూ.71,73,723, అలాగే 51గ్రాముల మిశ్రమ బంగారం, 3.200 గ్రాముల మిశ్రమ వెండి, 30 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాసశర్మ, సునీల్, ఏఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనిపిస్తే సమాచారం ఇవ్వండి


నిందితుడు

సిరిసిల్లక్రైం: పలు కేసుల్లో నిందితుడిగా అనుమానిస్తున్న వ్యక్తి పరారీలో ఉన్నాడని, కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సిరిసిల్ల టౌన్ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో యువకుడి ఫొటోను షేర్ చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఫొటోను సేకరించిన పోలీసులు అతని కోసం గాలింపులు చేపట్టారు. నిందితుడి వివరాలు తెలిసిన, ఎక్కడైన కనిపించినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని పెద్దాపూర్‌కు చెందిన బత్తిని శ్రీకాంత్(25) కొత్తపల్లి ఠాణా పరిధిలోని సీతారాంపూర్‌లో తన భార్య, తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఓ గ్యాస్ గోదాంలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంటున్నాడు. బుధవారం ఉదయం కడుపునొప్పి వస్తోందని కుటుంబసభ్యులకు తెలిపాడు. భార్య ఇంటి బయట ఉండగా లోపల ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

సంతానం కలగ లేదని...

ముస్తాబాద్(సిరిసిల్ల): సంతానం కలగడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్‌కు చెందిన గొట్టి ఇంద్రయ్య (45)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడం, భార్య కూడా పుట్టింటికి వెళ్లిపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

విద్యుత్ మోటార్ చోరీ

శంకరపట్నం(మానకొండూర్): ఇప్పలపల్లిలో ఎస్సారెస్పీ కెనాల్‌కు బిగించిన విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. ఇప్పలపల్లికి చెందిన రైతులు కాలువకు మోటార్లను బిగించుకొని, దుక్కులు దున్నుతున్నారు. రైతు చింతిరెడ్డి కర్ణాకర్ రెడ్డి కెనాల్‌కు తాను బిగించిన మోటార్‌ను చూడటానికి బుధవారం వెళ్లగా కనిపించలేదు. చోరీకి గురైందని కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇప్పటివరకు గ్రామంలో 10 వ్యవసాయ మోటార్ల దొంగతనం జరిగిందని రైతులు తెలిపారు.

మోడల్ స్కూల్ పిలుస్తోంది

- ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 7న పరీక్ష
- ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన
- ఉమ్మడి జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు



రుక్మాపూర్ మోడల్ స్కూల్ (ఫైల్)

కరీంనగర్/మల్లాపూర్/వీర్నపల్లి/జ్యోతినగర్: ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మోడల్ స్కూళ్లు ఓ వరం. రూ.వేలకు వేలు ఖర్చులు పెట్టి, దూరప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ సంస్థల్లో విద్యనభ్యసించాలంటే పిల్లలు ఇబ్బంది పడాల్సి వచ్చేది. చదువుకునేందుకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లోనే ఆదర్శ పాఠశాలలను నెలకొల్పడంతో నాణ్యమైన విద్య అందుతోంది. బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్న మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 12 నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 07న ఆయా పాఠశాలల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రూ.125, మిగతా వారు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలను http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఒక్కో పాఠశాలలో 100 సీట్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 38 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో చొప్పదండి మండలంలోని రుక్మాపూర్, కరీంనగర్ మండలంలోని ఎలగందల్, మానకొండూర్ మండలంలోని పోచంపల్లి, రామడుగు, వీణవంక, జమ్మికుంట మండలంలోని టీకుర్తి, చిగురుమామిడి మండలంలోని ములకనూర్, గంగాధర, శంకరపట్నం, తిమ్మాపూర్, సైదాపూర్‌లలో మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయి. 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు.

ఏప్రిల్ 1 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 1వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. పరీక్ష ఫలితాల ప్రకటన తర్వాత సంబంధిత ప్రిన్సిపాళ్లకు మెరిట్ జాబితాల అందుతుంది. మోడల్ స్కూళ్లలో విద్యార్థుల ఎంపిక జాబితా ఖరారు చేస్తారు. దానికి అడిషనల్ కలెక్టర్ల ఆమోదం తెలుపుతారు. మే 25 నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టి, ప్రవేశాలు కల్పిస్తారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

పరీక్ష విధానం..

6వ తరగతి ప్రవేశ పరీక్షలో 100 ప్రశ్నలు ఉంటాయి. 100 మార్కులు కేటాయించారు. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. 6వ తరగతిలో తెలుగు, గణితం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆంగ్ల పాఠ్యాంశాల్లో ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. 7 నుంచి 10వ తరగతులకు గణితం, సామాన్యశాస్త్రం, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్ నుంచి వంద ప్రశ్నలుంటాయి. ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు ఇస్తారు. 2 గంటలపాటు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం

బాలికలకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంది. 9, 10వ తరగతులతోపాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంద మందికి మాత్రమే అవకాశం. హాస్టల్‌కు కనీసం 3 కిలోమీటర్ల నుంచి ఆపైన దూరంలో ఉండేవారే ఇందుకు అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యతోపాటు ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ అందిస్తారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉంది. ఏటా మెరుగైన ఫలితాలు వస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు.

– జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

వృద్ధురాలికి ఉచితంగా మోకీలు మార్పిడి


మాట్లాడుతున్న డాక్టర్ బీఎన్ రావు

కరీంనగర్‌టౌన్: బీఎస్.రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధురాలికి ఉచితంగా మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేసినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ బీఎస్.రావు తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ఆదర్శ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గంగాధర మండలంలోని సర్వారెడ్డిపల్లికి చెందిన దాసరి కనకమ్మ పదేళ్లుగా మోకాలు నొప్పులతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉందన్నారు. ఆమె పరిస్థితిని బీఎస్.రావు హెల్త్ ఫౌండేషన్‌కు తెలుపగా ఉచితంగా మోకీలు మార్పిడి చేసేందుకు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 14న ఒక కాలికి ఆపరేషన్ పూర్తి అయిందని, మరో కాలికి వారం రోజుల్లో చేస్తామన్నారు. సుమారు రూ.2 లక్షల విలువైన ఈ ఆపరేషన్‌ను ఆదర్శ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ సత్యనారాయరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఫౌండేషన్ సేవలను ఇకనుంచి ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో నిర్వహిస్తామన్నారు. సంస్థ బాధ్యులు అలీం, రూన్సీ పాల్గొన్నారు.

‘అల్ఫోర్స్’లో ముందస్తు సంక్రాంతి

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్ట్స్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి గౌరీమాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, వేడుకలు, ముగ్గుల పోటీలను ప్రారంభించారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్యాయత పంచుకునే పండగ సంక్రాంతి

జగిత్యాల: సంక్రాంతి పండగ ప్రేమానురాగాలు పంచుకునే పండగ అని అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ, సంక్రాంతి పండగ ద్వారా సాంప్రదాయాల పరిరక్షణ సందేశాన్ని అందించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ఆనందోత్సవాలు, కేరింతల మధ్య బొడ్డెమ్మ వచ్చిందమ్మ అంటూ కేరింతలతో ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ వేషధారణలతో అందరినీ అలరించారు.


వేడుకల్లో విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుండీ లెక్కింపులో తాత్కాలిక ఉద్యోగి చేతివాటం

- రూ.11,010 దొంగిలిస్తూ పట్టుబడిన వైనం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు సందర్భంగా లడ్డూ, ప్రసాదం విభాగంలో తాత్కాలికంగా పనిచేస్తున్న ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. అంజన్న ఆలయానికి భక్తుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. ఇందులో తాత్కాలిక ఉద్యోగి కొలకాని రవి కూడా పాల్గొన్నాడు. ఉదయాన్నే లెక్కింపు కోసం వచ్చిన రవి.. డబ్బులను తీసి దాచిపెట్టడాన్ని గమనించిన నిర్మల్‌కు చెందిన మరో భక్తుడు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే అక్కడున్న ఏఎస్సై శ్రీనివాస్ పోలీసులతో రవి దుస్తులను సోదా చేయగా అందులో నుంచి రూ.11,010 లభించాయి. రవిపై ఈవో వెంకటేశ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన వ్యక్తి

సత్తక్కపల్లి శివారులో చిరుతపులి కలకలం

- పాదముద్రల ఆధారంగా నిర్ధారించిన ఫారెస్ట్ అధికారులు
- తాజాగా పలువురికి కనిపించిన చిరుత
- జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు


సత్తక్కపల్లి శివారులో ఓ పంటపొలంలో చిరుత పాదముద్రలు


చిరుతను చూసిన వ్యక్తి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఫారెస్ట్ అధికారులు

మెట్‌పల్లిరూరల్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి శివారులో చిరుతపులి సంచరించడం కలకలం సృష్టిస్తోంది. గ్రామ శివారు ప్రాంతంలోని ఉసికెగుట్ట సమీపంలో.. డంపింగ్ యార్డు వద్ద చెట్ల పొదల్లో.. పంట పొలాల్లో చిరుతపులి తిరిగినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. రెండురోజుల క్రితం ఇదే ప్రాంతంలో సంచరించిన చిరుతపులి.. బుధవారం అటువైపుగా వెళ్లినవారికి కనిపించడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిరుత కనిపించిన వెంటనే స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న అధికారులు మొదట చిరుతను చూసిన వ్యక్తి నుంచి పలు వివరాలు ఆరా తీశారు. చిరుత కనిపించిన పరిసరాల్లో గాలింపు చేపట్టారు. అయితే చిరుత కనిపించకపోవడంతో అంతకుముందురోజు గుర్తించిన పాదముద్రలను పరిశీలించి.. చిరుతపులేని అధికారులు నిర్ధారణకు వచ్చారు. గ్రామస్తులు, రైతులు, గొర్రెల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆందోళనలో రైతులు, గీతకార్మికులు

ఉదయం గ్రామ శివారులో కనిపించిన చిరుత.. సాయంత్రం సమయంలో సత్తక్కపల్లి – ఎర్రాపూర్ శివారు ప్రాంతం దుబ్బలభూమి వద్దగల రైల్వేలైన్ వద్ద కనిపించినట్లు రైతులు చెబుతున్నారు. అదే చోట సత్తక్కపల్లి, ఎర్రాపూర్ రైతుల పొలాలు, ఈత వనాలు ఉన్నాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. కల్లు గీసేందుకు గీత కార్మికులు భయపడుతున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

చిరుత రెండు, మూడు రోజులుగా తమ గ్రామ శివారులో సంచరిస్తోందని అటవీ శాఖ అధికారులకు తెలిపినా.. కేవలం జాగ్రత్తలే చెబుతున్నారే తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని సత్తక్కపల్లి గ్రామస్తులు అంటున్నారు. పాదముద్రలను పరిశీలించి చిరుత అని నిర్ధారించారని, పట్టుకునేందుకు ఎందుకు సాహసించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ అలీని వివరణ కోరగా.. సత్తక్కపల్లిలో చిరుత సంచరిస్తోందని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. అటవీప్రాంతంలో తిరుగుతున్న చిరుత ఇప్పటివరకు ఎలాంటి హానీ కలిగించలేదని, చిరుతను పట్టుకోవాలంటే నిబంధనలు ఉంటాయని, ప్రస్తుతానికైతే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణి బలి

- జింకగా అనుమానిస్తున్న అధికారులు
- ఆలస్యంగా వెలుగులోకి సంఘటన

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం సూరంపేట అటవీ ప్రాంతంలో ఓ వన్యప్రాణిని వేటాడి చంపి, కాల్చిన ఆనవాళ్ల ఫారెస్టు అధికారులకు ఆలస్యంగా లభించాయి. సదరు వన్యప్రాణి జింకనా..? లేక మనుబోతా..? తేలాల్సి ఉందని అధికారులు తెలిపారు. వారం క్రితం పక్కా సమాచారంతో కొడిమ్యాల ఫారెస్ట్ అధికారులు సూరంపేట అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ సమయంలో కాలినస్థితిలో ఉన్న ఓ అటవిజంతువు కనిపించింది. జంతువును వేటాడి చంపినట్లు అనుమానించి విచారణ చేపట్టారు. అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉచ్చు బిగించి.. వేటాడి చంపినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే ఆ వన్యప్రాణి జింకనా..? లేక మనుబోతా..? అని తేల్చేందుకు వాటి శరీర భాగాలను ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు ఎఫ్‌ఆర్‌వో లత బుధవారం తెలిపారు. ఫొరెన్సిక్ నివేదిక అనంతరం నిందితులపై కేసు నమోదు చర్యలు తీసుకుంటామన్నారు.



సంఘటన స్థలంలో వన్యప్రాణి తల, కాళ్లు

చెట్టును ఢీకొన్న ట్రాక్టర్

- డ్రైవర్ మృతి

మానకొండూర్: ట్రాక్టర్ చెట్టును ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలంలోని జగ్గయ్యపల్లికి చెందిన నందగిరి సాయినంద్ (26) గ్రామానికే చెందిన ఓ వ్యక్తి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం కూలీలను తీసుకొని, శ్రీనివాస్‌నగర్ వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో స్థానిక హనుమాన్ టెంపుల్ వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయినంద్ కిందపడటంతో తలకు, ముఖంపై గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి సోదరి కట్ట తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి


మౌన్సి (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఆరోగ్యం సహకరించడం లేదని, ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కావడంలేదని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని క్రిమిసంహారక మందు తాగగా చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని గోధూర్‌లో చోటుచేసుకుంది. మౌన్సి(17) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. తరచూ అనారోగ్యం బారిన పడుతున్న ఆమె చదువులో వెనుకబడుతున్నానని మానసికంగా కృంగిపోయింది. గత నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఉమాసాగర్ బుధవారం తెలిపారు. మృతురాలి తండ్రి లక్ష్మీనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లి, రాచర్లగుండారం గ్రామాల శివారుల్లో బుధవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రాచర్లగొల్లపల్లి శివారులో బైక్‌ను వ్యాన్ ఢీకొట్టడంతో గొల్లపల్లికి చెందిన ద్విచక్ర వాహనదారుడు ఖాదర్, మరొకరు, వ్యాన్ యజమాని సత్యం, డ్రైవర్ రాజం గాయపడ్డారు. ఖాదర్‌తోపాటు మరొకరిని సిరిసిల్లకు తరలించారు. రాచర్లగుండారంలో కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో గుండారం గ్రామానికి చెందిన ముడావత్ శ్రీరామ్, కిషన్ గాయపడ్డారు. అదే ప్రమాదంలో గోరింటాలకు చెందిన కారు డ్రైవర్ ప్రశాంత్ గాయపడ్డారు. గాయపడ్డ శ్రీరామ్, కిషన్‌లను 108లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్య కోసమే ఇంటర్నెట్ వినియోగించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేల సత్పతి

కరీంనగర్/తిమ్మాపూర్: ఇంటర్‌నెట్ కారణంగా విద్యార్థులు పెడదోవ పడుతున్నారని, దాన్ని విద్య కోసమే ఉపయోగించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. స్నేహిత కార్యక్రమాన్ని తిమ్మాపూర్‌లోని తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్లో బుధవారం ఆమె ప్రారంభించారు. ఆడపిల్లలు ఏ సమస్య ఉన్నా ధైర్యంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. ఒక గమ్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా చదువు కొనసాగించాలని పేర్కొన్నారు. ఫొటోలను, ఫోన్ నంబర్లను ఎవరికీ పంపించవద్దన్నారు. సర్పంచ్ నీలిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, వైద్యాధికారి లలితాదేవి, కరీంనగర్ రూరల్ సీడీపీవో సబితాకుమారి, డీసీపీవో శాంత, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ..

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఓ రైస్‌మిల్లును కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లును పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకుడు ప్రభాకర్‌రావుకు సూచించారు. ధాన్యం నిల్వల వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ కనకయ్య, పౌరసరఫరాల శాఖ అధికారులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రోడ్లపై ప్రయాణించే సమయంలో ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్టీసీ, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారులతో రోడ్ల ఆక్రమణ, మరమ్మతులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లపై పండ్లు, కూరగాయల అమ్మకాలు జరగకుండా చూడాలని, ఓవర్ లోడ్ వాహనాలు, గ్రానైట్ రవాణా మొదలైన వాటిపై చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించాలని పేర్కొన్నారు. వీధి దీపాలు, సీసీ కెమెరాలను బిగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం సత్యనారాయణ, డిపో–1 మేనేజర్ మల్లేశం, ట్రాన్స్‌పోర్ట్ అధికారి చంద్రశేఖర్ గౌడ్, రోడ్లు, భవనాల శాఖ అధికారి సాంబశివరావు, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, పంచాయతీరాజ్ ఈఈ నవీన్ కమార్, ట్రాఫిక్ ఏసీపీ సర్వర్, ఎస్‌ఈ ఆర్ అండ్‌బీ లక్ష్మణ్, ఎక్సైజ్ అధికారి తాతాజీ తదితరులున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న దొంగను పట్టణ పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లికి చెందిన అడ్లూరి నాగరాజు గతంలో పలుమార్లు దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు. ఇటీవల జైలు నుంచి వచ్చిన తర్వాత జగిత్యాల జిల్లా కేంద్రంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లాడు. బుధవారం సాయంత్రం పొన్నాల గార్డెన్‌కు వెళ్లే చిన్నకెనాల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నాగరాజు అనుమానాస్పదంగా కన్పించడంతో విచారణ చేపట్టగా విషయం వెలుగుచూసింది. అతనినుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై అబ్దుల్‌రహీం, మన్మథరావు, ఏఎస్సై వేణురావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ విశాల్ పాల్గొన్నారు.


పట్టుకున్న వాహనాలతో పోలీసులు

చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్

రామగుండం: విధుల్లో ఉన్న రైల్వే ఉద్యోగిని బెదిరించి, సామగ్రి చోరీచేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రామగుండం రైల్వే సీఐ సురేశ్‌గౌడ్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన కడమంచి మహేశ్, కడమంచి శ్రీను, చింతల శేఖర్, వనరాశి మల్లేశ్, ఇగ్గన నగేశ్, వనరాశి ఉప్పలయ్య గతనెల 14న రాత్రి గోదావరి రైల్వే వంతెన వద్ద విధుల్లో ఉన్న ట్రాక్‌మన్ పవన్‌కుమార్‌ను బెదిరించి రైల్వే సామగ్రి చోరీచేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను అరెస్టు చేశారు. వారినుంచి సొత్తును రికవరీ చేశారు. ఏఎస్సై శేఖర్‌రెడ్డి, సిబ్బంది అయిలయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సీఐ సురేశ్‌గౌడ్

గంజాయి విక్రేత అరెస్టు

పెగడపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పెగడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్ ఎస్సై సతీశ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం మండలంలోని వెంగళాయిపేటకు చెందిన రాగల్ల వంశీ(22) అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని సోదా చేయగా.. సుమారు రెండు కిలోల గంజాయి పట్టుబడింది. దాని విలువ సుమారు రూ.35వేల వరకు ఉంటుందని సీఐ వెల్లడించారు. నిందితుడి నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ, ఎస్సై, ఏఎస్సై సత్తయ్య, సిబ్బంది తిరుపతి, సంపత్, ఉదయ్, ప్రవీణ్, ఎల్లయ్యను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న పోలీసులు